**చుక్కమ్మ** హోటలు కిటకిటలాడుతూంది. హోటలు పక్కనే మల్లి కూర్చున్న కిళ్ళీ కొట్టు కళకళ లాడుతూంది. మల్లి చుక్కమ్మకు ముద్దుల కూతురే. ఆ కిళ్ళీ కొట్టు చుక్కమ్మదే. చుక్కమ్మ గల్లా పెట్టె ముందు కూర్చుంది. కిళ్ళీ కొట్లోని మల్లిని, కొట్టు ముందు జనాన్ని కళ్ళారా చూసుకుంటూ మురిసిపోతూంది. మల్లి ఆ కొట్లో కూర్చున్నప్పటి నుండి అటు హోటలుకు, ఇటు కిళ్ళీ బడ్డీకి రద్దీ పెరిగింది. మల్లికి ముందు ఆ కొట్లో ఒక కుర్రవాడు ఉండేవాడు. వాడు కొట్లో డబ్బులు తెలివిగా కాజేస్తున్నాడని చుక్కమ్మకు అనుమానం వచ్చి, కూతుర్నే కొట్లో కూర్చోబెట్టింది. మల్లి వయు పిప్పుడు వదహారే. మల్లి మన మెప్పుడూ పూల తేరే!

హోటలునుంచి బయటికి వస్తూన్న కాలేజీ కుర్రవాళ్ళు, ఫాక్టరీ పనివాళ్ళు కిళ్ళీ కొట్టు ముందు ఆగి, మల్లి అందాన్ని తాగుతున్నారు. మరింత మత్తు కోసం మల్లి కట్టుతూన్న కిళ్ళీలు నములుతున్నారు. సిగరెట్లు కాలుస్తున్నారు. బీడీలు వెలిగిస్తున్నారు.

"మల్లీ! ఒక మిటాయి కిళ్ళీ కట్టు. ఆ తరవాత అరపెట్టె నా బ్రాండు సిగరెట్లు, అగ్గిపెట్టె." ఫాక్టరీ గుమాస్తా నవ్వుతూ, పళ్ళికిలింపు.

"సిగరెట్టు ఒకటి. వక్కపొడి పొట్లం ఒకటి." కాలేజీ స్టూడెంట్ కళ్ళలో కోరిక. సిగరెట్ తీసుకుంటూ చేతివేళ్ళు తాకించి పొందే తన్మయత్వం.

**-శ్రీకంఠమూర్తి**

"ఒక సోడా కొట్టు, బేబీ!" మొగలిరేకులా మిస మిస లాడుతూంది పిల్ల — గడ్డం నెరిసిన బషీర్ సాహెబు మనసులో భావం.

"రెండు బీడీ లియ్యి, మల్లీ." కొబ్బరి ముక్కలా నోరూరిస్తూంది కుర్రది. దీపం బుడ్డితో బీడీ వెలిగించుకుంటూన్న రిక్షావాలా స్వగతం.

మల్లి రెండు చేతులూ చకచకా బేరాలు అమ్ముతున్నాయి. పెదాలు చిరునవ్వుల పువ్వులు రాలుస్తున్నాయి. ఎండలో కాలేజీ కుర్రవాళ్ళు; బుద్ధిమంతుల్లా తొందర తొందరగా రోడ్డు మీద నడిచి పోతూన్న అందమైన కుర్రవాళ్ళు కొందరు; కొట్టు ముందు ఆగి, సిగరెట్లు కాలుస్తూ, సినిమా కబుర్లు చెప్పుకుంటూన్న ఖుషీ రాయుళ్ళు; పిచ్చుక గూళ్ళను చిక్కు తీస్కుంటూ తమ షోకులు మల్లి కళ్ళలో ప్రతిఫలించా లనుకునే పిచ్చివాళ్ళు; పోగ్గాళ్ళు; చదువు సంధ్యలు సరదాగా, జీవితం జాలీగా గడిపే జల్సారాయుళ్ళు; కళ్ళు చికిలించేవాళ్ళు; పళ్ళికిలించే వాళ్ళు; కాట్లాడుకునే వాళ్ళు, పోట్లాడుకునేవాళ్ళు; అంతలోనే కలిసిపోయేవాళ్ళు, కాలం విలువ తెలియని కుర్రవాళ్ళు.

ఆ కుర్ర వాళ్ళందరిలో మల్లి కళ్ళు ఎవరినో వెదుకుతున్నాయి. రోడ్డు మీదికి అప్పుడప్పుడు దృష్టిని సారిస్తున్నాయి. ప్చ్! ఎక్కడా జాడ లేదు. మల్లిమనసులో కించిత్ నిరాశ, దిగులు.

మధ్యాహ్నం రెండు గంటలు. షుగర్ ఫాక్టరీ సైరన్ కూసింది. కుర్రవాళ్ళ కాళ్ళు నెమ్మదిగా కాలేజీ వైపు కదులుతున్నాయి. కిళ్ళీ కొట్టు ముందు జనం పలచబడ్డారు. హోటల్ రద్దీ తగ్గింది. మల్లి కొట్లోని పత్రిక ఒకటి తీసి, పేజీలు తిరగేసింది. ఒక పేజీలో కొత్తగా పెళ్ళి అయిన జంట ఫోటో. మెడలో పూల దండలు. మల్లి మనసులో మధుర ఊహలు ముసిరాయి. మురళి గుర్తుకు వచ్చాడు. 'మురళి కాలేజీలో ఒక సంవత్సరం చదివితే చదువు పూర్తి అయిపోతుంది. ఆ తరవాత ఉద్యోగం. మురళి తనను పెళ్ళి చేసుకుంటాడా? చేసుకుంటాడు. అతని కళ్ళలో ఆరాధన. మాటల్లో ఆత్మీయత! తనను వదిలి పెట్టడు!' మల్లి ఆలోచిస్తూంది.

మురళికి ఎవ్వరూ లేరని తెలిసి మల్లి మనసు ఒక నాడు తల్లడిల్లింది. అతని పరిస్థితి తెలిసి మరింత బాధపడింది. మాసిన బట్టలు, ముఖంలో గూడు కట్టుకున్న దిగులు, ఎవరితోనూ మాట్లాడకుండా, మూగగా, కిళ్ళీ కొట్టు వైపు చూస్తూ ముందుకు పోయే అతని రూపం — మల్లిలో జాలి, అభిమానం అంకురింపచేశాయి.

ఒక రోజు మురళి కిళ్ళీకొట్టు ముందుకు వచ్చి బెంచీ మీద దిగాలుగా కూర్చున్నాడు. ఎప్పుడూ కొట్టు ముందు ఆగని అతణ్ణి చూసి మల్లి మనసు రెపరెపలాడింది. ఇంతలో మరొక కుర్రవాడు వచ్చి, "ఏరా, మురళీ! ఫీజు కట్టలేదని నీ పేరు తీసేశారట కదా?" అన్నాడు.

విషయం అర్థమయిన మల్లి మురళిని దగ్గరికి రమ్మని పిలిచింది. డబ్బెంత కావాలని అడిగింది. మురళి చెప్పిన కథ, కావలసిన డబ్బు తెలుసుకొని, తను దాచుకున్న దానిలోనించి తల్లికి తెలియకుండా వెంటనే చేతిలో పెట్టింది.

మురళి కళ్ళలో కృతజ్ఞత మెరిసింది. ఆ తరవాత అలా ఎన్నోసార్లు రహస్యంగా ఫీజు కట్టడానికి, పుస్తకాలకు, అప్పుడప్పుడు బట్టలకు డబ్బు సాయం చేసింది. మురళికి డబ్బు ఇస్తూంటే ఆమె కేదో అనంతమైన తృప్తి; ఆనందం; మురళి బాగా చదవాలని, గొప్పవాడు కావాలనే కొండంత కోరిక; ఆ కోరిక వెనక మిణుకు మిణుకుమనే ఏదో ఆశ, ఆరాటం.


మల్లి మూడవ తరగతి వరకు చదువుకుంది. ఆపైన చదవటానికి చుక్కమ్మ ఒప్పుకోలేదు. చక్కగా హోటలు పని నేర్చుకో మంది. కాదంటే చింత బరికె చూపించింది. మల్లికి చదువుకోవాలని ఆశ. ఆ ఆశ ఆశగానే మిగిలిపోయింది.

చుక్కమ్మ మంచి వయసులో మొగుణ్ణి పోగొట్టుకుంది. వయసులోని ఒంటరితనం, పేదరికం పెదరెడ్డి పంచకు చేర్చాయి. పెదరెడ్డి ఆ వూళ్ళో పెద్ద మోతుబరి, చిన్న రాజకీయ నాయకుడు. చుక్కమ్మ కోసం చిన్న ఇల్లు కట్టించాడు. బంధువు లందరూ వెలివేసినా చుక్కమ్మకు కావలసిన భద్రత చిక్కింది. బ్రతుకు మరొక మలుపు తిరిగింది. మల్లి అప్పటికే మూడేళ్ళ పిల్ల. మల్లి భవిష్యత్తు కోసం చుక్కమ్మ చిన్న కాకా హోటలు పెట్టింది. కొంతకాలానికి కాకా హోటలు కాఫీ విలాస్‌గా మారింది. కాఫీ విలాస్ పక్కనే కిళ్ళీ బడ్డీ వెలిసింది. కిళ్ళీ బడ్డీలో చుక్కమ్మ మల్లిని కూర్చోబెట్టింది. మల్లి పెళ్ళి గురించి పెదరెడ్డి పట్టించుకోడు. ఉంచుకున్న దాని కూతురు ఎలా పోతే తనకేం అనే ఉదాసీనత.

చుక్కమ్మకు మల్లిని బాగా డబ్బున్న కుర్రవానికి ఇచ్చి పెళ్ళి చేద్దామని కోరిక. మల్లికి చదువుకున్న



వాడితో తాళి కట్టించుకోవాలని ఆశ. చుక్కమ్మ ఎంతోమంది కుర్రవాళ్ళకు కూతురి అందాన్నిచూపించి గాలం వేస్తూంది. మల్లి అందాన్ని కొరుక్కు తినాలని కోరిక అయితే చాలా మంది కుర్రాళ్ళకు ఉంది. ఆ కుర్రవాళ్ళలో ఆంజనేయులు ముఖ్యుడు. ఆంజనే



యులుకు తల్లిదండ్రులు లేరు. తరగని ఆస్తి మాత్రం ఉంది. అదీ బామ్మ సంరక్షణలో ఉంది. అయినా జాలీ జీవితం. సరదాకోసం చదువు. అమ్మా యిల్ని ఏడిపించడం హాబీ. మల్లిమీద కోరికతో చుక్కమ్మను కాకాపట్టాడు. మంచి చేసుకున్నాడు.

మల్లిని ప్రేమిస్తున్నా నన్నాడు. పెళ్ళి చేసుకుంటా నన్నాడు. చుక్కమ్మ సంతోషపడింది. ఆంజనేయు లుతో చనువుగా ఉండమని కూతురికి సలహా చెప్పింది. మల్లికి అతడంటే మంట. ఒక రోజు చీకటిపడేవేళ హోటలు వెనక ఇంట్లో ఆంజనేయులు మల్లిని అమాంతం పట్టుకున్నాడు. మల్లి గోల పెట్టింది. రోషంతో తల్లిని కేకవేసి, "ఇకముందు ఇంట్లోకి ఎవరినైనా రానిచ్చావంటే ఉరేసుకుని చస్తా" నని బెదిరించింది...

మల్లి కళ్ళు మిలమిలా మెరిశాయి. ఎదురుగ రోడ్డు మీద నడిచి వస్తున్న మురళి. కొత్త బట్టల్లో పెళ్ళికొడుకులా ముస్తాబయి. అవును, నిన్న చెప్పాడు — ఈ రోజు తను పుట్టిన రోజు.

తనతో పరిచయం అయినప్పటి నుండి టీ అల వాటు చేసుకున్నాడు. రోజూ ప్రొద్దుట, సాయం కాలం కాలేజీ నుంచి తిరిగి వచ్చేటప్పుడు హోటలుకు వచ్చి టీ తాగుతాడు. తల్లితో సంభాషణ ప్రారం

ఘిస్తాడు. టీ తాగి వక్కపొడి నములుతాడు. కొట్లో పేపరు తీసుకుని చదువుతూ, బెంచీ దగ్గర నిలబడి తనతో చిన్నగా కబుర్లు చెబుతాడు. ఆ కబుర్లలో ఎంతో చిలిపితనం; చిత్రమైన కోరికలు; చదువు గురించి, భవిష్యత్తు గురించి ఆశలు, ఆలోచనలు. "చిన్నెత్తుకుపోతా నెప్పటికైనా!" అంటాడు. "నీ పెళ్ళి నా తోనే!" అంటాడు. వూరిస్తాడు. ఉడికిస్తాడు.

"మల్లీ! వక్కపొడి పొట్లం ఒకటి ఇయ్యి!" మురళి పెదాలు పదం పాడుతున్నట్టు హుషారుగా కదులుతున్నాయి.

"ఈ రోజు దొరగారు కొత్త పెళ్ళి కొడుకులా వెలిగిపోతున్నారే!" మల్లి కళ్ళలో మతాబాలు వెలుగుతున్నాయి.

"కాలేజీకి సెలవు పెట్టేశాను. పెళ్ళి కూతుర్ని తీసుకు వెళదామనే వచ్చాను."

"మెల్లగా అనవే! అదిగో — అమ్మ మనవైపు చూస్తూంది."

"నిజం, మల్లీ! ఈ రోజు నా పుట్టిన రోజని తెలుసుగా? రాత్రికి నువ్వెలాగైనా సరే — నా గదికి రావాలి. ఒక్క గంట ఉండి వెంటనే వెళ్ళిపోదువు గాని. నీతో ఎన్నో కబుర్లు చెప్పాలి. మనం ఇద్దరం కలిసి భోజనం చెయ్యాలి. నీకోసం స్వయంగా నేనే స్వీట్ తయారు చేస్తున్నాను. తొమ్మిది గంటల తరవాత నీకోసం ఎదురుచూస్తూ ఉంటాను. ఓ. కే.?"

"అమ్మో! అమ్మ చంపేస్తుంది! రాత్రికి రావడమే!"

"రావాలి. తప్పకుండా రావాలి. ఈ వూళ్ళో నాకెవరున్నారు? ఒంటరిగాణ్ణి. నువ్వు రాకపోతే నాకు సంతోషమే లేదు. ఇంతకుముందు ఎన్నోసార్లు పగలు నా గదికి వచ్చావు. ఈ ఒక్క రాత్రికి నువ్వు రాకపోతే నా మీద ఒట్టే. వస్తావా? రావా? ఏదీ చేతిలో చెయ్యి వేయి!"

మరొక వక్కపొడి పొట్లం చేతికి ఇస్తూ మల్లి మురళి చేతిలో చెయ్యి వేసింది.

* * *

మల్లి పెండలకడనే కళ్ళి బిళ్ళి మూసేసి, కొద్దిగా అన్నం తిని, మంచం ఎక్కేసింది. చుక్కమ్మ కేక వేస్తున్నా సరే — "నాకు నిద్రవస్తూంది లేవే. నేనేమీ చెయ్యనింక" అంటూ గదిలో దూరి దుప్పటి మెడవరకూ లాక్కుంది. చుక్కమ్మకూ మల్లి త్వరగా నిద్రపోవడం మనసులో ఆనందంగానే ఉంది. రాత్రికి పెదరెడ్డి పచ్చలింపు సేవకు వస్తున్నట్టు పని మనిషి వచ్చి కబురు అందజేశాడు. పది పదిహేను రోజులకు ఒకసారి కాని చుక్కమ్మ ఇంటికి ఆయన రావడానికి వీలు కాదు. వచ్చే ముందు విధిగా కబురు చేస్తాడు. ముందుగా కబురు పెడితే అవసరమైన మందు, ముక్క ఏర్పాట్లు చుక్కమ్మ మస్తుగా చేస్తుందని ఆయన అభిప్రాయం. చుక్కమ్మ ఇప్పుడు ఆ ఏర్పాట్ల హడావిడిలోనే ఉంది. ఒకవైపు పనివాళ్ళు హోటలు సర్దటం పూర్తిచేశారు. ఒక కుర్రవాడు బ్రాందీ షాపు నుంచి తెచ్చిన మందు, స్వయంగా తయారు చేసిన ముక్క సరంజామా చుక్కమ్మ పదిలంగా తన ప్రత్యేకమైన గదిలో దాచింది.

మల్లి మంచం మీద పడుకుందే కాని, చీకట్లో కళ్ళు తెరుచుకుని నిద్ర నటిస్తూంది. తల్లి లడీకెం మధ్య స్నానం చెయ్యడం, చీర మార్చుకోవడం, సంతోషంగా గదిలో అటూ ఇటూ తిరగడం, అలంకరణ పూర్తి అయిన తరవాత పక్క బట్టలు మార్చడం — అన్నీ గమనిస్తూనే ఉంది. ఏ రోజు అయినా పెద్దరెడ్డి వస్తున్నట్టు తెలిస్తే మల్లి ఎప్పుడూ త్వరగానే నిద్రపోతుంది. అతను తల్లితో మాట్లాడే మాటలు, వాళ్ళ నవ్వులు మల్లికి అసలు కిట్టవు. పెదరెడ్డి రూపం చూడటానికే మల్లి మనసు ఇష్టపడదు. కాని, ఈ రోజు మురళి గదికి వెళ్ళాలి. ఆ తలంపుతో తలమునక అయిపోతూంది మల్లి.

పెదరెడ్డి వచ్చాడు. పెదరెడ్డి కూడా వచ్చిన పాలేరు వెనుదిరిగి వెళ్ళిపోయాడు. పెదరెడ్డి పట్టె మంచం మీద కూర్చున్నాడు. చుక్కమ్మ చీరకొంగు ముట్టూ కప్పుకుని గుమ్మం దగ్గర నిలబడింది. కష్టం, సుఖం, వ్యాపారంలోని లాభనష్టాలు లాంఛనప్రాయంగా చెప్పటం మొదలుపెట్టింది. చెబుతూ చిన్న టేబిలు మీద శ్రీవారికి మందు సరంజామా ఏర్పాటు చేసింది. శ్రీవారు చుక్కమ్మ మాటలు వింటూ, మందు సేవనం చేస్తున్నాడు. మధ్యలో చిలిపిగా చూస్తూ సరసోక్తితో చుక్కమ్మను నవ్విస్తున్నారు.

మల్లి మంచంలో అసహనంగా కదులుతూంది. మనసు గజిబిజిగా, ఆలోచనలతో సతమత మవుతూంది. పక్క గదిలోంచి మాటలన్నీ వినబడుతున్నాయి. ఈయన త్వరగా తాగేసి నిద్రపోతే బాగుండునని మల్లి నిట్టూరుస్తూంది. తల్లిని తిట్టుకుంటూంది.

"మల్లి నిద్ర పోయిందా?" పెదరెడ్డి అడుగుతున్నాడు.

"ఆఁ చాలా సేపయింది." చుక్కమ్మ జవాబు.

"మల్లికోసం కాలేజీ కుర్రవాళ్ళు కొట్టుముందు కుమ్ములాడుతున్నారంట. మల్లి ఎవడికన్నా గేలం వేసిందేటి?"

"ఆఁ! వాళ్ళండి. మా కెప్పుడూ ఎగతాళే! దాని బ్రతుక్కో దారి చూపించాలని లేదుగాని!"

"వస్తున్నానే — కోప్పడకుమరి! నాకు తెలిసిన చాకులాంటి కుర్రాడొకడు ఉన్నాడు. చదువులేదు గాని, సమితి ఆఫీసులో ప్యూనుగా పనిచేస్తున్నాడు. సంపాదన బాగానే ఉంటది. నువ్వు సరే నంటే— వచ్చే నెల్లో మల్లికి తాళి కట్టించేస్తాను. ఇంటున్నావా! మప్పిలా రా ముందు! ఆ తలుపు వేసెయ్."

చుక్కమ్మ పెదరెడ్డి మాటలతో తలుపు దగ్గరగా వచ్చి బయటికి తొంగి చూసింది. మల్లి మంచం దగ్గరికి ఒక సారి వెళ్ళి దుప్పటి సరిచేసింది. కూతురు నిద్రపోతూందని నిర్ధారణ చేసుకుని తన గదిలోకి వెళ్ళి తలుపు గడియ పెట్టేసింది.

మల్లి దుప్పటి విదిలించుకుని దిగ్గున లేచికూర్చుంది. ఒక్క క్షణం మనసులో భయం, కోపం కుమ్ములాడాయి. 'చదువురాదట! సమితి ఆఫీసులో ప్యూనట!



## పుర్సా

మన దేశంలో నివసించే విష సర్పాలలో పుర్సా ఒకటి. ఇది పిరికిదంలోనూ, ఇసుక నేలలోనూ నివసించే ఒక రకమైన రక్తపాద. దీనిని జంతుశాస్త్ర గ్రంథాలలో ఎకిస్‌కారినేటా అంటారు. ఇది సుమారు 18 నుంచి 30 అంగుళాల పొడవు వరకూ పెరుగుతుంది. శరీరం పృష్ఠభాగం గోధుమరంగులోనూ, ఉదరభాగం పసుపు రంగులోనూ ఉంటాయి. తల ముక్కోణాకారంలో, పొలుసులతో కప్పబడి ఉంటుంది. పుర్రెపైన తెల్లని బాణాకారపు గుర్తు ఉంటుంది. అదే విధంగా దేహం పొడవునా పృష్ఠభాగంలో ఉంగరాల ఆకారంలో మచ్చలు ఉంటాయి. ఈ రెండు ప్రత్యేక లక్షణాలను బట్టి ఈ సర్పాన్ని సులభంగా గుర్తించవచ్చు. దేహమంతా చిన్న పొలుసులతో కప్పబడి ఉండి, ఒక దానిని ఒకటి కప్పుతూ ఉంటాయి. ఈ పొలుసులు గరుకుగా ఉండి, అంచులు రంపపు పళ్ళవలె ఉంటాయి. దీనిని కలత పెడితే ఎనిమిది అంకె ఆకారాన్ని దాలుస్తుంది. ఇది ముడుచుకొన్నప్పుడు గరుకైన పొలుసుల రాపిడి వల్ల "ఫిస్" లేదా "పూ" అనే శబ్దం వస్తుంది. అందువల్లనే ఈ పాముని "పుర్సా" అంటారు.

పుర్సానోటిలో ఉండే విషపుకోరలు పెద్దవిగాను, గుల్లగాను ఉంటాయి. విషపు గ్రంథులు చిన్నవిగా ఉంటాయి. దీని విషం తక్కువ మోతాదులో ప్రమాదకరం కాకపోయినా, ఇతర జంతువులు (గొర్రెలు, మొదలైన పశువులు) కు ప్రాణాపాయాన్ని కలిగిస్తుంది.

ఇది ముఖ్యంగా తొండలను, ఇతర చిన్న పాములను, కీటకాలను ఆహారంగా తీసుకొంటుంది.

-కొలిపాని శ్రీరాములు

తన పెళ్ళి వీళ్ళ ఇష్టమే కాబోలు!' మంచం మీద దిండు సర్ది, దుప్పటి నిలువుగా వేసి, గదిలోంచి బయటికి వచ్చింది మల్లి. అడుగులో అడుగు వేసు కుంటూ నెమ్మదిగా రోడ్డెక్కి, మురళి రూమువైపు తిన్నగా నడక సాగించింది. రాత్రి పది గంటలు దాటింది. మొదటి ఆట సినిమా వదిలిపెట్టారు. జనం గుంపులు గుంపులుగా నడుస్తున్నారు. మల్లి కంగారుగా నడుస్తూంది. ఎవరైనా తెలిసిన వాళ్ళు కనుపించి పలకరిస్తారేమోనని బెదురుతూ నడుస్తూంది.

మురళి గది కాలేజీకి దూరంగా, ఊరికి కాస్త ఎడంగా ఒక పాడుపడ్డ మేడలో ఉంది. అద్దె తక్కువ అని అంత దూరంలో తీసుకున్నాడు. పగలు ఎన్నోసార్లు ఏదో పని పెట్టుకుని అటు వైపు మురళి గదికి వెళ్ళింది మల్లి. ఇప్పుడు రాత్రి పూట పోవడమంటే భయం భయంగా ఉంది. అక్కడ అన్నీ పాకలవాళ్ళ ఇళ్ళు, చెరువు, చెట్లు. మల్లి పెద్ద రోడ్డు మలుపు తిరిగి, సన్న వీథిలోంచి నడుస్తూంది. మ్యునిసిపాలిటీ దీపాలు మందంగా వెలుగుతున్నాయి.

'మురళి వంటచేసి అన్నం తినకుండా తనకోసం ఎదురుచూస్తూంటాడా? స్వయంగా స్వీట్ చేస్తానని గొప్పలు చెప్పాడు! కలిసి భోజనం చేయాలని, కబుర్లన్నీ చెప్పాలని పూరించాడు. తనమీద ఒట్టేసు కున్నాడు. గదిలోకి వెళ్ళగానే తనను చూసి ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయిపోతాడా? ఏమో? అమాంతం

> తల్లి తండ్రులు తమసంతానానికి ఇచ్చే గొప్ప వారసత్వం ఒక్కటే— రోజూ తమ కాలంలో కొలది నిమిషాలు వారికోసం వినియోగించడం.
>
> —జి. వి. బతిస్టా

తనను చుట్టేసి ఆ పైన ఏదైనా చేస్తే ... అమ్మో!' మల్లి ఆలోచనలు మధురంగా పరిమళిస్తున్నాయి.

మల్లి చెరువు పక్కగా నడుస్తూంది. కప్పలు బెకబెకమంటూ అరుస్తున్నాయి. కీచురాళ్ళు గోల చేస్తూ, పెడుతున్నాయి. మురళి గది అక్కడికి కనుపిస్తూంది. గదిలో దీపం వెలుగుతూంది. పాపం! తనకోసం పడిగాపులు కాస్తున్నట్టున్నాడనుకుంటూ మల్లి గబగబా ముందుకు నడిచింది. కర్రలతో కట్టిన గేటు తీసి, కాలికి తగులుతూన్న పిచ్చి మొక్కల్ని తప్పించుకుంటూ గది మెట్లెక్కింది. తలుపులు దగ్గరగా వేసి ఉన్నాయి.

"ఒరేయ్ మురళీ! నువ్వన్నట్టే మన పందెం పూర్తి అయ్యేసరికి మల్లి నిజంగా వస్తుందా?"

మాటలు ముద్దగా ఉన్నాయి. గొంతులో ఆనందం గంతులు వేస్తూంది.

"వస్తుందిరా! తప్పకుండా వస్తుంది. నా మీద దానికంత పిచ్చి ప్రేమ."

మురళి నవ్వు. మిగతా గొంతుల కేరింతలు.

"ఓ కే! అది వచ్చి నీ ఒళ్ళో పడగానే మన ఒప్పందం ప్రకారం ముందు నీవు — ఆ తరవాత మేమందరం. అర్థమయిందా? అర్థమయితే నీతో మే మందరం కలిసి పందెం వేసిన డబ్బు —అదిగో, ఆ కవరులో ఉంది ..."

"ఆల్‌రైట్ రా, ఆంజనేయులూ! పందెంకోసం కాకపోయినా, మీ అందరి కోసమేగదా — దాన్ని ఇంతకాలం ప్రేమించినట్టు నటించి పట్టి కొట్టించ బోతున్నా? వెర్రి బాగుల్ది! పాపం నన్నెంత గొప్పగా ప్రేమించిందిరా! నాతో తాళి కట్టించుకోవాలని, నా సరదాలకు, చదువుకు ఎంత పెట్టుబడి పెట్టిందిరా!"

మల్లి కళ్ళు తిరుగుతున్నాయి. మనసులో ముళ్ళు దిగుతున్నాయి. మెట్లమీద నించి గిరుక్కున వెనక్కు తిరిగింది. శక్తి కొద్దీ పరుగెడుతూ కెవ్వున అరిచింది.

మరుక్షణంలో — కేక విన్న మురళి, అతని మిత్ర బృందం గదిలోనించి ఆకలిగా మల్లి చుట్టూ మూగుతున్నారు.

చీకట్లో కాళ్ళకు పిచ్చి మొక్కలు అడ్డవచ్చి, గేటు పక్క ముళ్ళకంచె మీద ముందుకు పడి పోయింది మల్లి. ★

